క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ సాధనకు తరలిరావాలి



వీపనగండ్ల: ఎస్సీ వర్గీకరణ బిల్లు సాధనకై 11వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పరశురాం కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. మహాసభకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, రాముడు, ప్రవీన్‌కుమార్, సురేష్, శ్రీరాం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన నాయకులు



ఖిల్లాఘనపురం: జిల్లా కేంద్రంలో నిర్వహించిన గౌడ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గౌడ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల కేంద్రంతో పాటుగా అప్పారెడ్డిపల్లి, అల్లమాయపల్లి, మామిడిమాడ, అంతాయపల్లి, కమాలోద్దీన్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన గౌడ సంఘాల నాయకులు, సభ్యులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో వనపర్తి తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ గౌడ్ల ఆత్మీయ సమ్మేళనంలో సమస్యలను మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్‌ఎస్

వీపనగండ్ల: నిరుద్యోగులకు ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరోక్షంగా దోహదపడిందని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలంలో ఆదివారం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొని గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ అధికారంలోకి రాగానే పేద ప్రజల బాగుకోసం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలను ఆదివారం గోపల్‌దిన్నెలో సింగిల్ విండో మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి ప్రచారం చేశారు.

పార్టీ విధి విధానాలపై చర్చ



పెబ్బేరు రూరల్: అందరం కలిసికట్టుగా పని చేసి బీఎస్పీని గెలిపించాలని మండల అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన కార్యకర్తలకు రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై చర్చించి దిశా నిర్దేశం చేశారు. పార్టీ విధివిధానాలను ప్రజలకు వివరిస్తూ బీఎస్పీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ధర్మ, ఎల్లస్వామి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట మురుగు



ఆత్మకూర్: పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాల ఎదుట మురుగు నిలవడంతో విద్యార్థులు దుర్వాసన భరించలేకపోతున్నారు. పాఠశాల పరిసరాల్లో డ్రైయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో నివాసాల నుంచి వస్తున్న మురుగు పాఠశాల, రోడ్డుపై చేరుతుంది. ఈ విషయమై కాలనీవాసులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను మున్సిపల్ పాలకమండలి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని, కొన్ని నెలలుగా సమస్య పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

బస్టాండ్‌లో లైట్ల ఏర్పాటు



అమరచింత: మున్సిపల్ కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ కొన్ని నెలలుగా అంధాకారంలో మగ్గుతుండేది. విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని ఎన్నో సందర్భాలలో ఆర్టీసీ డిపో మేనేజర్‌కు విన్నవించారు. ఎవరూ స్పందించలేదు. ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బల్బులను ఏర్పాటు చేయడంతో వెలుగు సంతరించుకుంది.

అసంపూర్తిగా రోడ్డు పనులు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- వెల్కిచెర్ల, ఖిల్లాఘనపురం రోడ్డుకు కంకర పోసి వదిలేసిన వైనం



ఖిల్లాఘనపురం చింత చెట్ల బావి వద్ద రక్షణ గోడ



కంకరపోసి అసంపూర్తిగా వదిలేసిన మామిడిమాడ- పర్వతాపురం రోడ్డు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి భూత్పూర్ మండలం వెల్కిచెర్ల వరకు దెబ్బతిన్న బీటి రోడ్డుకు బీటి రెన్యూవల్ వేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా చేసి వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడటంతో కాంట్రాక్టర్ సల్కెలాపురం సమీపం నుంచి పర్వతాపురం వరకు రోడ్డు తవ్వి కంకర పోశారు. ఈ పనులు చేసి సుమారు మూడు నెలలు కావస్తున్న బీటీ వేయకపోవడంతో సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ, పర్వతాపురంతో పాటు ముందలితండా, వెనికితండా, బక్కతండా, మేడిబాయి తండాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.4కోట్ల నిధులు మంజూరు..

మండల కేంద్రం నుంచి వెల్కిచెర్ల వరకు మొత్తం 14 కిలోమీటర్ల రోడ్డుకు బీటీ రెన్యూవల్ కోట్ వేయడంతో పాటుగా అవసరమైన ప్రాంతాల్లో పాడుబడిన బావుల వద్ద ప్రమాదాల నివారణకు రక్షణ గోడలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినప్పటికీ మధ్యలోనే వదిలేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రక్షణ గోడల పనులు పూర్తి

పలు గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా పురాతన పాడుబడిన బావులు ఉండటంతో పలు మార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఆటోలు, మోటర్ సైకిళ్లపై వెళ్లిన వారు గమనించక బావుల్లో పడి ప్రమాదాలకు గురయ్యారు. రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని పలు సందర్భాల్లో ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. మంజూరైన రూ.10 లక్షల నిధులతో అధికారులు ప్రత్యేకంగా గుర్తించిన నాలుగు బావుల వద్ద రక్షణ గోడలు నిర్మించడంతో పాటుగా పైపు కల్వేట్లు పాడైన వద్ద కొత్తగా పైపులు వేయించారు.

త్వరలోనే బీటీ వేయిస్తాం

మండల కేంద్రం నుంచి పలు గ్రామాల మీదుగా వెల్కిచెర్ల వరకు ఉన్న బీటీ రోడ్డుకు రెన్యూవల్ కోట్ వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ రక్షణ గోడలు కట్టడంతో పాటుగా మెటల్ వేశారు. త్వరలోనే బీటీ రెన్యూవల్ పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– కబీర్‌దాస్, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

దాశరథి కృష్ణమాచార్యకు నివాళి



జిల్లా కేంద్రంలో దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఖిల్లాఘనపురంలో ..

వనపర్తిటౌన్: నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని ప్రకటించిన దాశరథి కలం, గళంతో ప్రజల గోస నిజాంలకు వినిపించిన మహా కవి అని పజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాష్ పేర్కొన్నారు. దాశరథి కృష్ణమాచార్య 36వ వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర తెలంగాణ విముక్తి కోసం కృషిచేసిన దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, విక్రం, గోపి పలువురు పూలమాలలు వేశారు. వారు మాట్లాడుతు రాష్ట్రానికి చెందిన కవి, రచయిత కృష్ణమాచార్య అన్నారు. నిజాం ప్రభువును ఎదిరిస్తు రచనలు చేసిన ధీరుడని కొనియాడారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని సగర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికి ప్రేరణ అందించిన వ్యక్తి అని తెలిపారు. కొన్ని వందల పాటలను రచించి తెలుగు సినీ సాహిత్యానికి ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్యగౌడు, రవీందర్‌రెడ్డి, రామన్‌గౌడ్, మల్లేష్, బుర్ర రామకృష్ణ, పెద్ద ఆంజనేయులుగౌడ్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా నాయకుల ప్రచారం



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న రవియాదవ్



చందాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మక్తల్‌లో ప్రజా ఆశీర్వాదసభ భారీ బహిరంగ సభలో పాల్గొటారని బీఆర్‌ఎస్ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు. ఆదివారం మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ వార్డుల్లో, గ్రామాల్లో నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారుశ్రీను, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, జడ్పీటీసీ శివరంజని, విండోఅధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబాళాపురంలో మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమని సింగిరెడ్డి వాసంతి ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వనపర్తి మండలంలోని చందాపురంలో పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మరోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు.

హామీలను ప్రజలను నమ్మరు



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు



జిల్లా కేంద్రంలో ప్రచారం చేస్తున్న నాయకులు

వనపర్తిటౌన్/పెబ్బేరు రూరల్: వనపర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి 70 మంది కార్యకర్తలు ఆదివారం జిల్లా కేంద్రంలో చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వారిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నాగం ప్రతాపరెడ్డి, చెన్నకేశవులు, సుల్తాన్, మలయ్య, రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని భావించి బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ప్రజలకు బీఆర్‌ఎస్ పాలన, కేసీఆర్ ప్రణాళికలు అర్థమయ్యాయని, ఈ ఎన్నికల్లో వారి నామమాత్రపు హామీలు, మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని చెప్పారు.

పాతపల్లి సర్పంచ్ కాంగ్రెస్ పార్టీలోకి..

కాంగ్రెస్ అభ్యర్థి చిన్నారెడ్డి సమక్షంలో పాతపల్లి సర్పంచ్ రవీందర్‌నాయుడు తన అనుచరులతో కలిసి ఆదివారం పాతపల్లిలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పథకాలపై ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు.

ప్రశించే గొంతుకను ఆదరించాలి

అవినీతి, అక్రమాలపై ప్రశించే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిన్నారెడ్డిని ఎమ్మెల్యే చేస్తేనే నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడుస్తుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 9వార్డు భగీరథ కాలనీలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. వనపర్తి నియోజకవర్గంలో చిన్నారెడ్డికి ఓటేసే గెలిపిస్తేనే బీఆర్‌ఎస్ నాయకుల అక్రమాలను అరికట్టగలమన్నారు. ప్రజలను మభ్యపెడుతూ చేసే అక్రమాలను ప్రజలకు వివరించి, ఇన్నేళ్లు నాయకుళ ముసుగులో చేసిన అవినీతిని బయట పెడతామన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చింది. దీంతో తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని ఆత్మహత్యాయత్నం

మరికల్: ఇథనాల్ కంపెనీ నుంచి చిత్తనూర్ గ్రామంతో పాటు ఇతర గ్రామాలను కాపాడాలని ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చిత్తనూర్‌కి చెందిన భాస్కర్ గాంధీభవన్ వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా.. కంపెనీ నుంచి తమ గ్రామం వదిలి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొదని, నా చావుతోనైన కంపెనీ రద్దు చేయాలని కోరారు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే తేరుకుని ఆత్మహత్యాయత్నం చేసుకోకుండా అతడిని అడ్డుకున్నారు. కంపెనీ రద్దు చేసే వరకు తమ ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తామన్నారు. ఇప్పటికే ఇథనాల్ కంపెనీ నుంచి వచ్చే విషాద్రవాలతో మూగజీవాలతో పాటు ప్రజలు కూడా రకరకాల వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వాకిటి శ్రీహరికి కాంగ్రెస్ బీఫాం

మక్తల్: నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరికి ఆదివారం హైదరాబాద్‌లో గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దిపాదాస్ మున్సీ, రోహిత్ చౌద్రి, మహేష్‌గౌడ్, రోహిత్‌చౌద్రి, శివసేనరెడ్డిహర్షవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా బీఫాం అందజేశారు. కార్యక్రమంలో బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, టీపీసీసీ గీత తదితరులు పాల్గొన్నారు.

టమాట కోత - తీసుకోవాల్సిన జాగ్రత్తలు



మదనాపురం: గ్రామీణా ప్రాంతాల్లో టమాట సాగు చేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పంట కోసిన తరువాత నిర్లక్ష్యం వహిస్తే నష్టపోయే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా టమాట కోసిన తర్వాత రైతులు గంపల్లో, బుట్టల్లో గానీ గ్రేడింగ్ చేయకుండా అమ్మడం వలన తక్కువ ధర వస్తుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాట కాయలు కోసిన వెంటనే కాయ పరిమాణం బట్టి వివిధ గ్రేడ్‌లుగా చేయాలి.

ప్యాకింగ్ విధానం

టమాట కాయాలను గ్రేడింగ్ చేసిన తర్వాత బుట్టలకు బదులుగా క్రేట్‌లలో, అనువైన సంచుల్లో ప్యాక్ చేయాలి. క్రేట్‌లలో ప్యాక్ చేసినట్లయితే దూర ప్రాంతాలకు రవాణా చేసేందుకు అనుకూలం. దోర టామాటలను సోడియం హైపోక్లోరైట్ 25 మి.లీ. గ్రాములు లీటరు నీటిలో కలిపిన ద్రావణంలో ముంచిన 21 రోజుల వరకు కాయలు నిల్వ ఉంటాయి. టమాట కాయాలు వ్యాక్సింగ్ చేయుట వలన బరువు తగ్గకుండా చాలా రోజుల వరకు నిల్వ ఉంటాయి. టామాట కాయాలను 6 శాతం వాక్సోల్ ఎమల్షన్, 9 శాతం సోడియం ఆర్థోఫినైల్ ఫీనేట్‌లో ముంచి తీస్తే చాలా రోజులు నిల్వ ఉంటాయి. టమాట పండ్లను 13 సెంటీమీటర్లలో 90 శాతం తేమగా ఎక్కువ రోజులు నిల్వ చేయవచ్చు.

టామాటతో ఉత్పత్తులు

ప్రధానంగా టామాటతో అనేక విధాలుగా ఉత్పత్తులు చేయవచ్చు. చాలా ప్రాంతాల్లో టమాటను వివిధ రూపాల్లో తయారు చేసి వాడుకుంటారు. అందులో ముఖ్యమైనవి టమాట రసం, టమాట కెచప్, టమాట చిప్స్, టమాట సూపు, టామాట క్యానింగ్, తీపి రకాలతో సలాడ్, కెచప్, ప్యూరి ఇతరవి తయారు చేయవచ్చును.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: మండలంలోని బునాదిపురం చెందిన గుంటి బాలయ్య శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అదజేశారు. గుడిసె రమేష్‌కుమార్, వెంకటేష్ సాగర్, బుచ్చిబాబు, ఎల్లస్వామి, నాగన్న తదితరులు ఉన్నారు.

వీపనగండ్ల: మండలంలోని బోరెల్లి ఈశ్వరయ్య వైద్య ఖర్చుల నిమిత్తం మదన్‌మోహన్‌రావు రూ.10 వేల నగదును పంపించగా, ఆయన అనుచరులు ఆదివారం కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మౌలాలి, బలుసరామన్‌గౌడ్, పెద్ద రాంబాబు, బిచ్చయ్య, సుధాకర్, చిన్న రాంబాబు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం కుమ్మక్కు



వాకిటిశ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కత్తేపల్లి వాసులు

ఆత్మకూర్/అమరచింత : రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటై కాంగ్రెస్ గెలుపును అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని, ప్రజలు వారి కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరముందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మండలంలోని కత్తేపల్లి మాజీసర్పంచ్ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో వంద మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే గ్రామాల్లో నాయకులు వేర్వేరుగా ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు ఖాయమని ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, పరమేష్, శ్రీను, రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, వెంకటన్న, అజ్మత్, జుబేర్, షబ్బీర్, శంషీర్, పాండురంగ, ప్రహ్లాద్ ఉన్నారు.

కాపాలా ఉంటామని రాష్ట్రాన్ని దోచుకున్నారు

కొట్లాడి సాధించుకున్న రాష్ట్రానికి కాపాలా ఉంటూ ప్రజల అభ్యున్నతికి పాల్పడుతానని ప్రగల్బాలు పలికిన సీఎం కేసీఆర్ కేవలం రాష్ట్రంలోని సంపదను దోచుకోంటున్నారని టీపీసీసీ కల్లుగీత కార్మిక రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. మక్తల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న వాకిటి శ్రీహరిని గెలిపించమంటూ ఆదివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 3, 4వ వార్డులలో ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేస్తూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు.

బీజేపీ హయాంలో బీసీ ముఖ్యమంత్రి



మాట్లాడుతున్న అశ్వత్థామారెడ్డి

వనపర్తిటౌన్: తెలంగాణలో బీజేపీ హయంలో బీసీ ముఖ్యమంత్రి అవుతాడని, నియోజకవర్గంలో బీజేపీని ఆదరిస్తే ప్రజలకు సుపరిపాలన అందుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి అశ్వత్థామారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన బూత్ కమిటీల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశ్వత్థామరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి మాట్లాడుతూ.. నీళ్లు, నియామకాల పేరుతో కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో సోమశీల నుంచి నీళ్లు రాయలసీమ తరలిపోయే ప్రమాదం ఉందని ఆరోపించారు. నిధులు కల్వకుంట్ల కుటుంబానికే వెళితే తెలంగాణలో అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బసవరాజు, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీశైలం, జ్యోతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

పాన్‌గల్/అమరచింత/ఆత్మకూర్: కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని కొల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని వెంగళాయిపల్లిలో నిర్వహించిన పరివర్తన్ యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇప్పటికే నియోజకవర్గంలో జాతీయ రహదారి, సోమశిల–సిద్దేశ్వరం బ్రిడ్జిని సాధించామన్నారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు.

ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్లు మహేశ్వరి, నాగలక్ష్మి అన్నారు. ఆదివారం పట్టణంతో పాటు మండలంలోని అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

మక్తల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలేందర్ రెడ్డి గెలుపు కోసం బూత్ స్థాయి కార్యకర్తలు విస్తృతంగా కృషి చేయాలని వెంకటేశ్వర్ అన్నారు. పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పట్టణంలోని బూత్ స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అన్నారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గల్లంతైన మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌షకుర్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని షేరిల్లీవీధికి చెందిన ఖమ్రాబేగం(33)కు అయిజకు చెందిన అబిద్ హుసెన్‌తో 10 సంవత్సరాల కిందట వివాహమైంది. నాలుగు నెలల నుంచి భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో భర్త తన ఇద్దరు పిల్లలను తీసుకుని అయిజకు వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటూ కలత చెంది శనివారం రాత్రి పిజేపి కుడి కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రి గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ మహిళ ఆచూకి లభించలేదు. ఆదివారం ఉదయం జములమ్మ రిజర్వాయర్‌లో గల్లంతైన మహిళ మృతదేహం తేలడంతో జాలర్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు. తమ్ముడు జావెద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

చికిత్స పొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి

మల్దకల్: చదువుకోవాలని తండ్రి మందలించడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ విద్యార్థి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఏఎస్ఐ ఈశ్వరయ్య కథనం ప్రకారం.. మండలంలోని మద్దెలబండకు చెందిన తిరుమలయ్య, గోవిందమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు సురేష్(20) గద్వాలలో డిగ్రీ చదువుకుంటున్నాడు. గత నెలలో సురేష్ ఇంటికి రావడంతో తండ్రి చదువుకోవాలని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ గత నెల 27న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని, తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

శాంతినగర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలిలా.. మండలంలోని కొంకలకు చెందిన తెలిగి గుడిసె శ్రీనివాసులు, ఇట్లపురం శ్రీను, టీజీ రామకృష్ణ శనివారం శాంతినగర్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గుడిసె శ్రీనివాసులు శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాసులుకు భార్యతోపాటు ముగ్గురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.